క్లుప్తంగా

నియామకం



నియామకపత్రం అందిస్తున్న రాజేశ్వర్‌రావు

జమ్మికుంట: కాంగ్రెస్ పార్టీ జమ్మికుంట మండల బీసీ సెల్ అధ్యక్షుడిగా ఎగ్గెటి సదానందం నియామకమయ్యారు. పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు గురువారం నియామకపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మేకమల్ల అశోక్, వర్కింగ్ ప్రెసిడెంట్ నరేశ్‌గౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆపదలో 1098కు ఫోన్ చేయాలి



అవగాహన కల్పిస్తున్న కోఆర్డినేటర్ సంపత్

రామడుగు: మండలంలోని వన్నారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గురువారం చైల్డ్ హెల్ప్ లైన్ 1098 నంబరుపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా చైల్డ్ హెల్ప్‌లైన్ నంబరు జిల్లా కోఆర్డినేటర్ సంపత్ మాట్లాడారు. విద్యార్థులు ఆపదలో 1098 నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు. స్మార్ట్‌ఫోన్ వల్ల నష్టాలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీరాజం, నరేంద్ర, సాయికిరణ్, మహేశ్, చరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'అల్ఫోర్స్'లో కలర్స్ డే



కలర్స్ డేలో నరేందర్‌రెడ్డి

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ స్కూల్‌లో గురువారం కలర్స్ డే, దీపావళి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అతిథిగా హాజరైన అల్ఫోర్స్ విద్య సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి విద్యార్థులకు నిత్య జీవితంలో కలర్స్ ప్రాముఖ్యత గూర్చి తెలియజేశారు. విద్యార్థులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.


టీచర్ల ఆర్థికసాయం



హెచ్‌ఎంకు నగదు అందిస్తున్న టీచర్లు

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీఈటీ జ్యోతి, తెలుగు టీచర్ ఆదిలక్ష్మి పాఠశాల అభివృద్ధికి రూ.5వేల చొప్పున ఆర్థికసాయం చేశారు. గురువారం హెచ్‌ఎంకు నగదు అందించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయుల బృందం పీఈటీ, టీచర్‌ను అభినందించారు.


బీజేపీకి రాజీనామా



వంశీకృష్ణ

చిగురుమామిడి: బీజేపీ చిగురుమామిడి మండల ఉపాధ్యక్షుడు బోయిని వంశీకృష్ణ పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. నాలుగేళ్లుగా పార్టీకి సేవలందించానని, కొంత కాలంగా పార్టీలో సరైన ప్రాధాన్యత కల్పించకపోవడం, పలుమార్లు అవమానాలకు గురికావడంతో తీవ్ర మనస్తాపానికి గురై రాజీనామా చేశానని వంశీకృష్ణ తెలిపారు.

మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఫాతిమారెడ్డి

కొత్తపల్లి: న్యూఢిల్లీకి చెందిన ఐఎంవో ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ నిర్వహించిన గణిత పరీక్షలో రేకుర్తిలోని ప్యారడైజ్ పారడైజ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించినట్లు ఆ పాఠశాల చైర్మన్ పోతిరెడ్డి ఫాతిమారెడ్డి తెలిపారు. పాఠశాలలో గురువారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు పి.అక్షిత, పి.శివాని, హెచ్.శ్రీజ, జి.లాస్య, బి.మేఘనలను అభినందించారు. అకాడమిక్ సీఈవో ఉమాకాంత్, ప్రిన్సిపాల్ టి.వసంత, వైస్ ప్రిన్సిపాల్ ఏ.మధు, ఏవో కె.శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిధులు మంజూరైనా ఫలితమేమి?

- నూతన జీపీ భవనాలకు స్థల కొరత
- ఆరు గ్రామ పంచాయతీలకు రూ. 20 లక్షల చొప్పున మంజూరు
- అధికారులు పట్టించుకోవాలని వేడుకోలు



గోపాల్‌రావుపేట గ్రామ పంచాయతీ కార్యాలయం

రామడుగు: నూతన పంచాయతీ భవనాల నిర్మాణానికి అవసరమైన స్థలాలు లేకపోవడంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోతోంది. దీంతో నూతన నిర్మాణ పనులు ప్రారంభం కాలేని పరిస్థితి మండలంలో నెలకొంది. మండలంలో 23 గ్రామ పంచాయతీలు ఉండగా, ఆరు గ్రామ పంచాయతీల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కొత్త భవనాల నిర్మాణానికి ఇటీవల ప్రభుత్వం ఎంజీఎన్ ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా ఒక్కో భవనానికి రూ.20 లక్షల మంజూరు చేసింది.

మండలంలో ఇదీ పరిస్థితి...

మండలంలోని వెదిర, దేశరాజ్‌పల్లి, రుద్రారం, గోపాల్‌రావుపేట, పందికుంటపల్లి, షానగర్ గ్రామాలకు పాత పంచాయతీ భవనాల స్థానంలో కొత్త పంచాయతీ భవనాలు నిర్మించనున్నారు. స్థల సమస్యతో నిర్మాణ పనులు జరుగని పరిస్థితి నెలకొంది.

గ్రామాల్లో ...

గోపాల్‌రావుపేట గ్రామంలో పాత పంచాయతీ భవనం స్థానంలో నిర్మాణం చేయాలని గ్రామానికి చెందిన కొందరు ప్రజాప్రతినిధులు, ప్రజలు కోరుతున్నారు, మరికొందరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నిర్మాణం చేయాలని కోరుతుండడంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. పందికుంటపల్లి నూతన గ్రామ పంచాయతీ ఏర్పడిప్పటి నుంచి పాఠశాల భవనంలో జీపీ కార్యాలయం కొనసాగిస్తున్నారు. నూతన భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు కావడంతో పందికుంటపల్లి గ్రామసక్తులు తమ గ్రామంలో స్థలం ఉందని ఇక్కడే నిర్మాణం చేయాలని పట్టుబడుతున్నారు, కుర్మపల్లిలో నిర్మాణం చేయాలని గ్రామస్తులు కోరుతుండడంతో నూతన పంచాయతీ భవనం పనులు ముందుకు సాగడం లేదు. వెదిర, దేశరాజ్‌పల్లి గ్రామాలలో పంచాయతీ భవనం కోసం స్థల సమస్య ఉండడంతో నిర్మాణానికి నోచుకోవడంలేదు. షానగర్‌లో పాత పంచాయతీ భవనం కూల్చి ఇటీవల పనులు ప్రారంభించారు. రుద్రారంలో స్థల సమస్య లేకపోవడంతో అధికారులు ఇటీవల పనులు చేపట్టారు.

సమస్యలు పరిష్కరించాలి

మండలంలోని పలు గ్రామ పంచాయతీ భవనాలకు నిధులు మంజూరు కావడంతో స్థల సమస్య ఉన్న గ్రామాల్లో అధికారులు సమస్యలు పరిష్కారం చేయాలి. నూతన భవన నిర్మాణాలకు కృషి చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

పనులు ప్రారంభిస్తాం..



మండలంలోని ఆరు గ్రామ పంచాయతీల భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. కొన్ని గ్రామాల్లో పంచాయతీ భవనాల నిర్మాణాలకు స్థలం లేకపోవడంతో ఆలస్యం అవుతుంది. త్వరలో సమస్యలను పరిష్కరించి నిర్మాణ పనులు ప్రారంభిస్తాం.

– సచిన్, ఏఈ (పీఆర్), రామడుగు

పోలీస్‌స్టేషన్ తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మహంతి

కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌రూరల్ పోలీస్‌స్టేషన్‌ను సీపీ అభిషేక్ మహంతి గురువారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించి సమస్యాత్మక, సున్నితమైన పోలింగ్ కేంద్రాల వివరాలు తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లోని సిబ్బందికి పలు సూచనలు చేశారు. గత ఎన్నికల సమయంలో గొడవలు చేసిన, అల్లర్లు సృష్టించి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి, ఓటర్లను ప్రభావితం చేసే వ్యక్తులపై పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని అన్నారు. వారిని సంబంధిత అధికారుల ఎదుట బైండోవర్ చేయాలని, ఉల్లంఘిస్తే బౌండ్ డౌన్ చేసి పూచీకత్తు సొమ్ము మొత్తాన్ని జప్తు చేయాల్సి వస్తుందని, జైలు శిక్ష కూడా విధించపడుతుందని వారికి తెలపాలని సూచించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, అలసత్వం ప్రదర్శిస్తే శాఖపరమైన చర్యలు తప్పవన్నారు. క్షేత్రస్థాయిలో ఎన్నికల నియమావళిని రాజకీయ పార్టీలకు, వ్యక్తులకు అతీతంగా నిష్పక్షపాతంగా పక్కాగా అమలు పరచాలన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్‌కుమార్, ఎస్సై రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్

చొప్పదండి: ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ కోరారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో స్వశక్తి గ్రూపు మహిళలకు గురువారం ఓటుహక్కుపై అవగాహన కార్యక్రమం, ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈసందర్భంగా శాంతికుమార్ మాట్లాడుతూ.. ఓటుహక్కుపై ఏమైనా సందేహాలుంటే 1950 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో కులం, మతం, జాతి, వర్గం, భాషా, ఒత్తిడి ప్రభావితం కాకుండా ఎన్నికల ప్రశాంతతను కాపాడుతూ నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ప్రశాంత్ కుమార్, డీఎంసీ శ్రీవాణి, మానస, రవీందర్, అంజయ్య, శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైశ్య సేవా కేంద్రం కార్యవర్గానికి సన్మానం



కార్యవర్గాన్ని సన్మానిస్తున్న కొండయ్య

కరీంనగర్‌కల్చరల్: వైశ్య సేవా కేంద్రం నూతన కార్యవర్గాన్ని గురువారం సాయినగర్ సాయిబాబా ఆలయంలో అన్నదాన కమిటీ చైర్మన్ చిట్టుమల్ల కొండయ్య సన్మానించారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా ఆలయ చైర్మన్ ప్రకాశ్ పటేల్, సభ్యులు నలుమాచు చంద్రశేఖర్, రామిడి శ్రీధర్, ముప్ప సత్యం, విశ్వనాథుల శ్రీనివాస్, డైరెక్టర్లు సిరిపురం సురేందర్, బొల్లం శ్రీనివాస్, సుభాష్, పోకల లక్ష్మీనారాయణ, కొమురవెల్లి వెంకటేశం, కృష్ణకిశోర్, నార్ల శ్రీనివాస్, ఎల్గూరి రవి, మల్లేశం, మునీందర్, చంద్రశేఖర్, శ్రీధర్, ఆలయ సిబ్బంది గుడికాడి శ్రీనివాస్, పిట్టల అంజయ్య పాల్గొన్నారు.

విశ్వరూప మహాసభ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మల్లయ్య, నాయకులు

చిగురుమామిడి: హైదరాబాద్‌లో 11న నిర్వహించనున్న మాదిగ, ఉపకులాల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు ఖాత మల్లయ్య కోరారు. గురువారం చిగురుమామిడి బస్టాండ్ ఆవరణలో మహాసభ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్లు, వర్గీకరణ, చట్టబద్ధత కల్పించాలని కోరుతూ మహాసభ ఏర్పాటు చేశామని, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాసభకు ప్రధాని నరేంద్రమోదీ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని చెప్పారు. మండలంలోని 17 గ్రామాలకు చెందిన నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి బెజ్జంకి అంజయ్య, నాయకులు కాత తిరుపతి, మాస్టిన్ హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి దర్శనం నర్సింహా, జిల్లెల్ల సదయ్య, సంపత్, కృష్ణయ్య, కొమురయ్య, బాబు, రాజు, శేఖర్, నాంపల్లి, సదానందం, హరీశ్, లక్ష్మణ్, పాల్గొన్నారు.

నగదు, బియ్యం అందజేత



నగదు, బియ్యం అందజేస్తున్న దాతలు

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేటలో పలువురు బాధిత కుటుంబాలకు శ్రీలక్ష్మీనరసింహస్వామి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏకే ఇన్ఫ్రాడెవలపర్స్ సంస్థ ప్రతినిధులు ఆర్థికసాయం, బియ్యం అందజేశారు. గ్రామానికి చెందిన రేండ్ల సంజీవ్ నోటి క్యాన్సర్‌తో బాధపడుతుండగా యాభైకిలోల బియ్యం, ట్రాక్టర్ ప్రమాదంలో గాయపడిన దాసరి మల్లేశంకు రూ.5 వేలు, గైనీ ఆశాలు బ్రెయిన్‌స్ట్రోక్‌తో బాధపడుతుండగా రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో దాతలు ముదుగంటి మధుకర్‌రెడ్డి, అనిల్‌కుమార్, జైపాల్‌రెడ్డి, కరుణాకర్, విజయ్‌కుమార్, సంతోష్‌కుమార్, రాంగోపాల్‌రెడ్డి, దాసరి రవిశాస్త్రి, హన్మంతరెడ్డి, పలువురు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఉషు పోటీలకు ఎంపిక



కరీంనగర్‌స్పోర్ట్స్: మహబూబ్‌నగర్‌లో శుక్రవారం నుంచి జరుగనున్న రాష్ట్రస్థాయి ఉషు పోటీలకు నగరంలోని రెసోనెన్స్ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల ఉమ్మడి జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఫండస్ స్కూల్‌లో జరిగిన ఉషు పోటీల్లో విద్యార్థులు శ్రీవర్షితరెడ్డి, టి.హాసిని, నయనిత, అజితేస్, తవాబ్, ఋషిల్, బిలాల్ హుస్సేన్ ఎంపికయ్యారన్నారు.ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ అంజిరెడ్డి, ప్రిన్సిపాల్ సుదర్శన్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

కాలుష్యం తగ్గించేందుకు సహకరించాలి



ప్రమిదలు పంపిణీ చేస్తున్న శాంతికుమార్

చొప్పదండి: పట్టణంలో కాలుష్యం తగ్గించేందుకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ కోరారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో అధికారులు గురువారం స్వచ్ఛ దివాళీ, శుభ్ దివాళీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలు కాలుష్యం బారిన పడకుండా ప్రమిదల్లో దీపాలు వెలిగించాలన్నారు. అనంతరం స్థానిక మహిళలకు ప్రమిదలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ప్రశాంత్‌కుమార్, మెప్మా డీఎంసీ శ్రీవాణి, ఏడీఎంసీ మానస, రవీందర్, అంజయ్య, శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఓటు ప్రాధాన్యతపై అవగాహన



పారిశుధ్య కార్మికులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న నగర పాలక సంస్థ కమిషనర్ శ్రీనివాస్

కరీంనగర్‌కార్పొరేషన్: ఈనెల 30వ తేదీన జరిగే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ అన్నారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఓటు ప్రాధాన్యతపై పారిశుధ్య కార్మికులకు అవగాహన కల్పించారు. 10, 11, 12, 33, 51 డివిజన్‌ల పరిధిలో విధులు నిర్వహించే పారిశుధ్య కార్మికులకు భగత్‌నగర్‌లోని భగత్‌సింగ్ చౌరస్తాలో ఓటు వినియోగంపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం పారిశుధ్య కార్మికులతో ఓటు హక్కు వినియోగిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. 1950 టోల్ ఫ్రీ నంబర్, సీవిజిల్ యాప్ వినియోగాన్ని వివరించారు. ఓటు వేయడంతో పాటు చుట్టు ప్రక్కల వారిని కూడా ఓటు వేసేలా చైతన్యపర్చాలని కోరారు. ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిజాయితీగా ఓటు హక్కును వివియోగించుకుంటేనే మనం వేసే ఓటుకు విలువ అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ నరేశ్‌బాబు, నోడల్ అధికారి బి.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ మార్పునకు ఓటు హక్కు కీలకం



మాట్లాడుతున్న ఈశక్

సప్తగిరికాలనీ(కరీంనగర్): సమాజ మార్పునకు ఓటు హక్కు అత్యంత కీలకం అని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నగర ఉపాధ్యక్షుడు ఎల్కటూరి ఈశక్ అన్నారు. గురువారం నగరంలో జరిగిన ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కమిటీ సమావేశంలో మాట్లాడారు. ఓటు హక్కు వినియోగించుకోవడం అందరి బాధ్యత అని అన్నారు. దేశ అభివృద్ధి కోసం ఓటుహక్కు భారత రాజ్యాంగంలో అందించారని తెలిపారు. మంచి నాయకుడిని ఎన్నుకోవడం అందరి బాధ్యత అని, అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

జమ్మికుంట: అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టుకొని సీజ్ చేశామని ఎక్సైజ్ సీఐ అక్బర్‌హుస్సేన్ తెలిపారు. మండలంలోని మాచనపల్లికి చెందిన వ్యక్తి నుంచి మద్యం స్వాధీనం చేసుకొని, వాహనం సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు. సీఐ మాట్లాడుతూ.. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని, మద్యం తరలిస్తే చర్యలుంటాయని హెచ్చరించా రు. కార్యక్రమంలో ఎస్ఐలు రమాదేవి, కబీర్‌దా స్, హెడ్ కానిస్టేబుల్ ఐలయ్య, సిబ్బంది ఉన్నారు.



విద్యుత్ సమస్యలు తలెత్తకుండా పర్యవేక్షించాలి



మాట్లాడుతున్న ఎస్ఈ గంగాధర్

కొత్తపల్లి: క్షేత్రస్థాయిలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని సిబ్బందికి టీఎస్ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ సూచించారు. కరీంనగర్ సర్కిల్ కార్యాలయ ఆవరణలోని సమావేశ మందిరంలో గురువారం రాత్రి నిర్వహించిన కరీంనగర్ టౌన్, రూరల్ సబ్ డివిజన్ల ఓఅండ్ఎం సిబ్బంది సమీక్షా సమావేశంలో విద్యుత్ అంశాలపై మాట్లాడారు. క్షేత్రస్థాయిలో విద్యుత్ సమస్యను గుర్తిస్తే బ్రేక్‌డౌన్లను నివారించవచ్చునన్నారు. విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు లేకుండా చూసుకోవాలన్నారు. అదే విధంగా వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా చేస్తూనే రెవెన్యూపై దృష్టి సారించాలని అన్నారు. డీఈ రాజం, ఏడీఈ కొలుపుల రాజు, ఏవో అరవింద్, ఏఈలు, ఓఅండ్ఎం సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపై ధాన్యం.. పొంచి ఉన్న ప్రమాదం



కరీంనగర్‌రూరల్: ధాన్యం ఆరపెట్టేందుకు కల్లాలు లేకపోవడంతో రోడ్లపైనే ఆరబోస్తున్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా కల్లాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినప్పటికీ స్థలాలు అందుబాటులో లేకపోవడంతో రైతులు ముందుకు రాలేదు. అధికారులు సైతం అవగాహన కల్పించలేదు. వానాకాలం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. కరీంనగర్ మండలం చామనపల్లి, ఇరుకుల్లలోని కేంద్రాల్లో స్థలం సరిపోక రోడ్డుపైనే ధాన్యం ఆరబెడుతున్నారు. గతంలో చామనపల్లిలో రాత్రివేళల్లో ద్విచక్రవాహనదారులు ధాన్యం కుప్పలతో ప్రమాదాలకు గురైన ఘటనలున్నాయి. అధికారులు రైతులకు ప్రత్యామ్నాయ స్థలాలు, చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.